# భూమి గుండ్రంగా ఉంది

రమేష్ ఎమ్మే సోషియాలజీ పాసయ్యాడు.

అతను తనకు తానే గొప్ప ఆదర్శవంతుణ్ణనుకొంటాడు.

అందుక్కారణం అతడెన్నో పుస్తకాలు చదివాడు.

హీనుల, దీనుల, పతితుల, భ్రష్టులకోసం తమ సుఖాలను వదులుకొని జీవితాలనే అంకితం చేసిన మహాపురుషుల చరిత్రలను చదివాడు.

గాంధీజీ హరిజనోద్యమం గురించి, హరిజనవాడల్లో ఉద్యమం గూర్చి పుస్తకాల్లో పఠించాడు. మథర్ థెరిస్సా తన జీవితాన్నంతా మానవ సేవకోసం వినియోగించడం గూర్చి చదివాడు.

వీరేశలింగం పంతులు విధవా వివాహాల గూర్చి; స్త్రీలకోసం, వాళ్ల అభ్యున్నతి కోసం అతడు చేసిన త్యాగాల గూర్చి పుస్తకాల ద్వారా తెలుసుకున్నాడు.

యుద్ధంలో క్షతగాత్రులైన వారికి అమూల్యమైన సేవ లందించిన డాక్టర్ కొట్నీస్ లాంటి వాళ్ళ గురించి చదివాడు. పరిస్థితుల ప్రాబల్యం వల్ల వేశ్యలుగా మారిన సోదరీమణుల గూర్చి, అలాంటి వాళ్లకోసం త్యాగాలు చేసిన గొప్పవాళ్ల గురించి గ్రంథపఠనం ద్వారా తెలుసుకొన్నాడు.

అనేక పుస్తకాలు చదవడంవల్ల కొన్ని ఆదర్శాలను ఒంటబట్టించుకున్నాడు. తాను గాంధీ పుట్టిన కాలంలో పుట్టనందుకు విచారించాడు. వీరేశలింగం పంతులు సమకాలికుడు కానందుకు చింతించాడు. యూనివర్సిటీ నుంచి బయటకొస్తూ వీడ్కోలు సభలో అందరిముందూ తానెంతో ఆదర్శంగా ఉంటానని, ఏదో గొప్ప కార్యం తప్పకుండా చేస్తానని ఘోరమైన ప్రతిజ్ఞ చేశాడు.

యూనివర్సిటీ నుండి బయటకొచ్చిన రమేష్ ఆదర్శాల వేటలో ఉన్నాడు. ఏదో ఎవరూ వేయని గొప్ప కార్యంలాంటిది చేసి మహాపురుషుల జాబితాలో కెక్కాలనుకున్నాడు.

అతని ఆదర్శాలకు అడ్డంకులేర్పడకుండా అదృష్టవశాత్తు ఉద్యోగం కూడా తొందరగానే దొరికింది... ఇక తన ఆదర్శాలను అమలులో పెట్టాలనుకున్నాడు కాని, అతనికేం చెయ్యాలో తోచటంలేదు. తనకంటే ముందే అందరూ అన్నీ చేసినందుకు, తనకేమీ మిగలనందుకాతనికి బాధగా వుంది.

ఎలాగైనా తానేదో చేసి పత్రికల్లో పతాక శీర్షికల కెక్కాలని అతని కుబలాటంగా ఉంది... పుస్తకాలు చదివి ఒంటబట్టించుకున్న ఆదర్శాలతన్ని నిలువనీయడం లేదు.

ఏం చేయాలో తోచక సతమతమవుతున్న సమయంలో పేపర్లో ఓ వార్త చదివాడు... బలవంతంగా మోసంతో వేశ్యాగృహానికమ్మబడిన ఓ అభాగ్యురాలి గురించిన వార్త అది.

ఆ వార్త చదివిన వెంటనే రమేష్ మెదట్లో ఓ ఆలోచన తళుక్కున మెరిసింది.

"తానో వేశ్యను పెళ్లాడితే...?" తనను తానే ప్రశ్నించుకున్నాడు. పలుమార్లు ప్రశ్నించుకున్నాడు.

"ఇలా చేయడం వల్ల తనకెంతో పేరు వస్తుంది. ఓ పతిత నుద్ధరించిన వాడుగా తనకెంతో కీర్తి వస్తుంది. ఆదర్శవంతుడిగా తన నెంతోమంది పొగుడుతారు. తాను చదివిన అనేక పుస్తకాల్లో ఇలాంటి పనులు చేసినవాళ్లే గొప్పవాళ్ళుగా కీర్తింపబడ్డారు." అని ఆలోచించి వేశ్యను పెళ్లాడటానికే నిర్ణయించుకున్నాడు.

ఇటీవలకాలంలోనే వేశ్యాగృహానికెళ్ళిన అందమైన వేశ్యకోసం గాలించసాగాడు రమేష్. తీవ్రంగా గాలించాడు. ఆ పట్టణంలోని అన్ని వేశ్యాగృహాలను తిరిగాడు. తుదకో అమ్మాయిని పెళ్ళి చేసుకోవడానికి ఎంపిక చేసుకున్నాడు... ఈ విషయం గూర్చి స్నేహితులతో చెప్పాడు.

వాళ్లు తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా బాగా ఆలోచించుకొమ్మన్నారు. వాళ్లకేం తెలియదని, తాననుకున్నదే చేయడానికి సిద్ధమయ్యాడు.

తాననుకున్న పని త్వరలో చేసెయ్యాలన్న సంకల్పంతో తాను తిరిగి తిరిగి ఎన్నుకున్న వేశ్య 'సరళ' దగ్గరికెళ్లాడు. తన గురించి చెప్పాకొని, తన ఆదర్శాలు గురించి వివరించి, "నేను నిన్ను వివాహం చేసుకుంటాను" అన్నాడు రమేష్.

ఆ మాటలు విన్న సరళ అతడూహించినట్టుగా ఎగిరి గంతెయ్య లేదు. అతి మామూలుగా "ఎందుకు...?" అంది.

"నిన్నీ జీవితం నుండి విముక్తి చేయడానికి."

"నాకీ జీవితం బాగా లేదు... నన్ను ఈ జీవితం నుండి దూరం చెయ్యమని మిమ్మల్నెప్పుడూ కోరలేదే..."

"నువ్వు కోరావని కాదు... కాని ఏదో ఆదర్శవంతమైన పని చెయ్యాలన్న ఉద్దేశ్యంతో చేస్తున్నాను."

"మీరు మంచి పనులు చెయ్యాలనుకుంటే ఎన్నో ఉన్నాయి. ఈ పనే ఎందుకు చెయ్యాలనుకుంటున్నారు...? దీనివల్ల మీకొచ్చే లాభమేమిటి?"

పేరొస్తుందని చెప్పాలనుకున్నాడు. కాని, చెప్పలేకపోయాడు.

"నా కెందుకో ఈ పని చెయ్యాలనుంది... చేస్తాను..."

"సరే, కొద్దిరోజులు మీరు ఆలోచించుకోండి... నేను ఆలోచించుకుంటాను..." అని రమేష్‌ను పంపించింది సరళ...

సరేనని వెళ్ళిపోయిన రమేష్ పదిహేను రోజుల్లోనే తిరిగి సరళ దగ్గరికొచ్చాడు...

"నేనన్నీ ఆలోచించుకున్నాను... మనిద్దరం వివాహం చేసుకుందాం" అన్నాడు.

"మీరాదర్శాల వేడిలో ఉన్నారు. అటు తర్వాత మీరెన్నో సమస్యల నెదుర్కొవాల్సి

వస్తుంది. నిజ జీవితంలో ఎదురయ్యే ప్రాక్టికల్ సమస్యల గూర్చి మీరాలోచించడం లేదు" అంది సరళ.

"నేనెంతో మంది మహాపురుషుల చరిత్రలు చదివాను. వాళ్ళు ఎన్నో సమస్య లెదుర్కొన్నారు. అయినా వెనుకాడలేదు. అన్నీ తెలిసే నేనీ నిర్ణయం తీసుకున్నాను" అన్నాడు రమేష్.

"కేవలం పుస్తకాలు చదివి తీసుకున్న నిర్ణయాలు చాలాకాలం నిలువడం కష్టం... అటు తర్వాత ఎదురయ్యే సమస్యల గూర్చి బాగా ఆలోచించండి... సమాజం ఎంతో పురోగమిస్తుందనుకున్నా ప్రేమ పెళ్ళిళ్ళు చేసుకున్నవాళ్లే ఇప్పటికీ ఎన్నో సమస్యల నెదుర్కొంటున్నారు. ఓ వేశ్యను పెళ్లాడి సమాజాన్నెదిరించి నెగ్గుకురావడం చాలా కష్టం. బాగా ఆలోచించుకోండి..." అని రమేష్‌ను పంపించింది సరళ...

కొద్దిరోజు లాలోచించాడు రమేష్. ఏదేమైనా తన ఆదర్శాలను వదిలి పెట్టడానికతడు సిద్ధంగా లేడు. అందువల్ల వచ్చే కీర్తి ప్రతిష్ఠలను వదులుకోవడానికాతనికి మనసొప్పడం లేదు... ఆరు నూరైనా సరే వేశ్యను పెళ్ళి చేసుకొని తీరాలనుకున్నాడు.

చదివిన పుస్తకాల విజ్ఞానం అతన్ని ముందుకే తోస్తుంది... త్వరగా పనిని కానియ్యమని అతడు ఆదర్శాలు హెచ్చరిస్తున్నాయి... పది రోజుల తర్వాత మళ్లీ సరళ దగ్గరికెళ్లాడు.

"నువ్వు నాకింకేమీ చెప్పొద్దు... నేనన్ని విషయాల గూర్చి ఆలోచించాను. నేను తప్పకుండా వేశ్యను పెళ్లాడతాను. నీకు నాతో రావడం ఇష్టం లేకుంటే చెప్పు... మరొకర్ని సెలక్ట్ చేసుకుంటాను..." ఖచ్చితంగా తన అభిప్రాయం చెప్పాడు రమేష్. సరళకు ఒప్పుకోక తప్పలేదు... తాననుకున్న పని విజయవంతం కాబోతున్నందుకు రమేష్ కెంతో సంతోషంగా వుంది.

ద్విగుణీకృతోత్సాహంతో అతడు జర్నలిస్టులను కలుసుకున్నాడు. సోషియల్ ఆర్గనైజేషన్స్ సెక్రటరీలను కలుసుకున్నాడు. నాయకులను కలుసుకున్నాడు. సరళ, రమేష్ వివాహం గూర్చి పత్రికల్లో పబ్లిసిటీ గణనీయంగా జరిగింది. జిల్లా కమ్యూనిటీ హాలులో సరళ, రమేష్‌లు అందరి సమక్షంలో దండలు మార్చుకొని దంపతులయ్యారు. పెళ్ళి కొచ్చిన పెద్దలు అతన్నెంతో పొగిడారు. ఆదర్శజీవి అన్నారు.

రమేష్‌లాంటి యువకులు దేశానికి అవసరమన్నారు. లోకల్ ఎమ్.ఎల్.ఏ గారయితే రమేష్‌ను సాక్షాత్తు వీరేశలింగం పంతులుగారితోనే పోల్చాడు. అంతకంటే ఎక్కువే అన్నాడు. "దేశాన్ని ఉద్ధరించిన ఆదర్శ యువకుడు. సంఘాన్ని ఉద్ధరించి వేశ్యను పెళ్లాడిన ఆదర్శవాది" లాంటి పతాక శీర్షికలతో రమేష్ వివాహాన్ని గూర్చి పొగుడుతూ అన్ని పత్రికల్లో తన పేరు చూసుకొని మురిసిపోయాడు రమేష్. తాననుకున్నది సాధించినందుకు తనను తానే అభినందించుకున్నాడు. ఓ మూడు గదుల పోర్షన్ అద్దెకు తీసుకొని కాపురముంటున్నాడు రమేష్. కొద్దిరోజులు గడిచాయి... రమేష్ పెళ్లి గూర్చి తెలుసుకున్న ఇంటి ఓనర్ నిర్మొహమాటంగా.

"ఇది సంసార్లుండే కొంప... దయచేసి వెంటనే ఇల్లు ఖాళీ చేసి మరో ఇల్లు చూసుకోండి..." అన్నాడు.

ఏం చెప్పినా వినకుండా ఇల్లు ఖాళీ చేయించాడు... మరో రెండిళ్లలోనూ అలాగే జరిగింది. ఆర్నెల్లల్లో నాలుగిండ్లు ఖాళీ చెయ్యాల్సొచ్చింది... తుదకో ఇంట్లో ఓనర్‌ను బ్రతిమిలాడి మూడు నెల్లుగా ఉంటున్నాడు...

రమేష్ మిత్రులాతన్ని దేశోద్ధారకుడని, కాదు వేశ్యోద్ధారకుడని దెప్పి పొడుస్తున్నారు.

"రమేష్... అదృష్టమంటే నీదే. అన్ని అనుభవాలున్న స్త్రీని పెండ్లి చేసుకున్నావు. నీకే ప్రాబ్లం లేదు... నీకు తెలియకున్నా నేర్పుతుందనుకుంటాను."

నవ్వుతూనే అన్నాడో మిత్రుడు స్టేజీమీద పొగిడిన నాయకులే రమేష్ కనబడితే ముఖం చాటుచేసుకుంటున్నారు.

అతడంటే విముఖత చూపెడుతున్నారు. చాటుగా అతన్ని గూర్చి మాట్లాడుకుంటున్నారు. ఆ మాటలు ఆలస్యంగానైనా రమేష్‌ను చేరుతూనే ఉన్నాయి.

"కొంచెం జాగ్రత్త... నీ భార్య మంచిగుంది. కులం చెడ్డా సుఖం దక్కాలె... అలవాటయిన ప్రాణం... ఇంట్లోకెవ్వర్నీ రానియ్యకు మంచిగ కాపాడుకో..."

ప్రత్యక్షంగా కొంత, పరోక్షంగా కొంత రమేష్‌ను రకరకాలుగా అంటున్నారు.

క్రమక్రమంగా రమేష్‌లో ఆదర్శాల వేడి చల్లారుతుంది. జీవితానుభవాల నుండి కాకుండా కేవలం పుస్తకాల ద్వారా ఏర్పరచుకున్న ఆశయాలవడం వల్లా సేవాభావంతో కాక మిటమిట జ్ఞానంతో పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్టు తీసుకున్న నిర్ణయాలవడం వల్ల ఆదర్శాలమోజు త్వరలోనే తగ్గుతుంది. దానికి తోడు అవమానకరమైన మాటలతనిపై ప్రభావం చూపుతున్నాయి. ఆదర్శాల తెర తొలగి నిజజీవితం వికృతంగా దర్శనమిస్తుందతనికి...

ఇప్పుడు రమేష్ సరళపై విసుక్కుంటున్నాడు. ఆఫీసు నుండి ఇంటికొచ్చేసరికి వాకిట్లో కూర్చొనుంటే సరళను కసురుకుంటున్నాడు... తాను వచ్చేసరికి అలంకరించుకొన్న సరళను అనుమానంగా చూస్తున్నాడు.

"సరళా! నీవు బయటకు రాకు... ఇంట్లోనే ఉండు... నలుగురు నాలుగు విధాలుగా అనుకుంటున్నారు..." అన్నాడోసారి రమేష్.

రోజురోజుకామె కెన్నో ఆంక్షలు విధిస్తున్నాడు. ఆమె బయట నిల్చోవద్దు. కిసుక్కున నవ్వొద్దు. అందంగా అలంకరించుకోవద్దు... అతనింట్లో లేనప్పుడు ఎవరొచ్చినా లోపల్నుండే మాట్లాడాలి.

"అంటే, నేను వ్యక్తిత్వం పూర్తిగా చంపుకొని బ్రతకాలనా మీ ఉద్దేశ్యం..." అంది సరళ ఓరోజు.

"వ్యక్తిత్వం...? వేశ్యగా బతికిన నీకు ఏం వ్యక్తిత్వ ముంటుంది...? నీకు కృతజ్ఞతనేదే లేదు... ఆ బుద్దులెక్కడికి పోతాయి?"

"అంటే, మీరు నాకేదో మేలు చేసానుకుంటున్నారు! నన్ను ఉద్ధరించాననుకుంటున్నారు... కాని, సంసారిగా నాకు మీరిచ్చిన స్వేచ్ఛేంటి...? నాకప్పుడు ఎవ్వరితోనైనా మాట్లాడే స్వతంత్ర ముండేది... ఇప్పుడదీ లేదు...

నాకారోగ్యం బాగాలేకుంటే నా జోలికెవ్వర్ని రానిచ్చేదాన్ని కాదు... కాని, భార్యగా నా ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండానే మీరు నా శరీరంతో ఆడుకుంటారు. నాకప్పుడున్న వ్యక్తిత్వం, స్వేచ్ఛకూడా ఇప్పుడు లేకుండ పొయ్యాయి..."

"మాటలు బాగా నేర్చావు... మనిషి కోమాట నేర్చుకున్నట్టున్నావు."

"నా పూర్వ స్థితిని మీరంత ఎత్తిపొడవల్సిన పన్లేదు..."

వాళిద్దరి మధ్య ఘర్షణ రోజురోజుకీ పెరిగిపోతోంది ఎలాగైనా సరళను వదిలించుకోవాలనుకుంటున్నాడు రమేష్... ఇంట్లోంచి తరిమెయ్యాలనుకుంటున్నాడు... కాని, తానై ఆ పని చెయ్యకూడదు. అలా చేస్తే తనను పొగిడిన పత్రికలే తిడ్తాయి... సంస్కర్తగా తనకొచ్చిన పేరుపోతుందని అతని ఆలోచన... పేరుకు పేరూ ఉండాలి, సరళ తననుంచి దూరం కావాలని అతని ఆలోచన.

ఎంతో అందగత్తెయిన సరళ ఇప్పుడు రమేష్‌కు వికృతంగా కనబడుతుంది. ఒళ్ళమ్ముకున్నదానిగా అగుపడుతుంది. ఆమె నెలా వదిలించుకోవాలా అని మధనపడుతున్న రమేష్‌కు

"నేను లేచిపోతున్నాను...సరళ..."

అని ఓ కాగితంపై రాసిపెట్టి వెళ్లిపోయిన సరళ చేసిన పని ఎంతో ఆనందాన్నిచ్చింది. కాగల కార్యాన్ని గంధర్వులే తీర్చారని సంతోషపడ్డాడు... సరళ రాసి పెట్టిన కాగితాన్ని తీసుకెళ్ళి పత్రికల వారికిచ్చాడు. నేనెంతో సానుభూతితో ఆమె నుద్ధరించాలని పెళ్ళి చేసుకున్నాను, కాని ఆమె పాత బుద్ధులు పోలేదని చెప్పుకున్నాడు.

"వేశ్య నుద్ధరించాలని భంగపడిన ఆదర్శ యువకుడు. వేశ్యను పెళ్లాడి మోసపోయిన యువకుడు" లాంటి శీర్షికలతో సరళ నీచత్వాన్ని, రమేష్ మంచితనాన్ని గూర్చి ఎన్నో కాలమ్స్ రాశారు పత్రికల వాళ్ళు... సోషల్ ఆర్గనైజేషన్స్ వాళ్ళూ అతనిపై సానుభూతి చూపారు. అందరూ సరళను తిట్టారు... రమేష్‌ను పొగిడారు. పేరుకు పేరూ దక్కి, పీడ విరగడయిందని ఆనందించాడు రమేష్.

తన తెలివితేటలకు తనని తానే అభినందించుకున్నాడు.

కాని, సరళ నిజాలు బయటపెట్టి ఎప్పుడేం గొడవ చేస్తుందోనని ఓ మూల అతనికి భయముంది... ఆమె ఎందుకంత సులభంగా తనను వదిలిపోయిందో అతని కర్థం కావడం లేదు. ఏదేమైనా జరిగినపని కతనికి చాలా సంతోషంగా వుంది.

కొద్ది రోజుల తర్వాత రమేష్‌కో ఉత్తరం వచ్చింది. వణుకుతున్న చేతులతో ఆ ఉత్తరాన్ని చింపాడు. లేఖ చదువుతున్న రమేష్ కనుబొమలు ముడిపడుతున్నాయి.

"ఆదర్శ యువకిశోరం రమేష్‌గారికి-

మీరు వేశ్యను పెళ్లాడాలని తీసుకున్న నిర్ణయం కేవలం పుస్తకాల పరిజ్ఞానంతో... ఆదర్శాల పేరుతో...కీర్తి కండూతితో ... కాని, జీవితమంటే అవగాహనుండి కాదు...ఇలాంటి నిర్ణయాలు తీసుకొని నెగ్గుకు రావడం అంత సులభం కాదు. దానికెంతో మనోనిబ్బరం కావాలి... సేవా భావం కావాలి... త్యాగ నిరతి కావాలి... మీలో ఇవేమి లేవు... ఉందల్లా పేరు సంపాదించుకోవాలన్న తపనొక్కటే.

ఈ సంగతి నాకు మీతో మాట్లాడి నప్పట్నుంచే తెలుసు... మన వివాహం భంగమవుతుందనీ తెలుసు... అయినా, నేను వివాహానికి ఒప్పుకొన్నాను. ఎందుకో తెలుసా? మీరు ఆదర్శాల వేటలో ఉన్నారు. ఎవరు చెప్పినా వినేట్టు లేరు. నన్ను కాకుంటే మరో వేశ్యను పెళ్లాడుతారు. ఆమె నాలా పాప భారాన్ని మోస్తూ వెళ్లిపోదు... మిమ్మలనల్లరిపాలు చేస్తుంది...మీరు మరింత పతనమవుతారు... మిమ్మల్ని మీరు ఎస్టిమేట్ చేసుకోకుండా నిర్ణయాలు తీసుకునే మీరు అల్లరిపాలు కావద్దనే, మరో వేశ్యవల్ల చెడిపోవద్దనే, మీ కోసమే పెళ్లికొప్పుకున్నాను...

మీకు పాడు పేరు రాకుండా నన్ను వదిలించుకోవడానికి మీరు చేస్తున్న ప్రయత్నాలను గమనించాను...అందుకే ఇప్పుడు కూడా మీ కోసమే 'లేచిపోతున్నాను' అని కాగితం రాసిపెట్టి బయటపడ్డాను... మీకు చెడు పేరుకు బదులు మంచివాడుగా పేరొచ్చింది... నా పీడ విరగడయింది. నేను తల్చుకుంటే మిమ్మల్ని అల్లరి పెట్టగలను... కాని నేనలా చేయను... ఇప్పటికైనా మీరేంటో తెలుసుకోని నిర్ణయాలు తీసుకోండి.

నేను లేచిపోయాననుకుంటున్నారు కదూ! లేచిపోలేదు... మరెక్కడికెళ్ళానని సందేహంగా ఉండొచ్చు మీకు... ఎక్కణ్ణుంచి వచ్చానో అక్కడికే పోతున్నాను. మరి భూమి గుండ్రంగా ఉంది కదా...! మీతో గడిపిన కొద్ది కాలంలో ఈ సమాజంలో భార్యగా స్త్రీ కెంత గౌరవం స్వేచ్ఛ ఉందో అర్థం చేసుకున్నాను.

అందరి పరిస్థితి ఇలా వుండకున్నా ఈ సమాజంలో స్త్రీ పరిస్థితి ఘోరంగానే ఉంది... మీకెట్టి పరిస్థితిలోనూ భవిష్యత్తులో అడ్డురాను.

గుడ్ బై..."

సరళ

● ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 30–8–90 ●

*(1990 కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ)*

★ ★ ★